సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 11 । ఆగస్టు । 2025



డబ్బులిచ్చాం.. ఓటరు స్లిప్‌లు ఇవ్వండి!

తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలు మితిమీరాయి. వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి మరీ దాడులు చేసిన కూటమి నేతలు తాజాగా ఓటర్లను టార్గెట్ చేశారు. -8లో



జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు పకడ్బందీగా బందోబస్తు

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణకు 1400 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేశాం. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/20.0

జిల్లాలో ఆదివారం 20.0 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

పోలింగ్‌లో జంబ్లింగ్!

- ఇప్పటికీ పులివెందుల ఓటర్లకు అందని స్లిప్పులు
- ఓటర్లు తారుమారు కావడంతో పంపిణీలో గందరగోళం
- తలలు పట్టుకుంటున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు
- కొనసాగుతున్న టీడీపీ మూకల అరాచకం
- ఇ.కొత్తపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతల వ్యవసాయ బోరు ధ్వంసం



సాక్షి ప్రతినిధి, కడప: ''ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గించాలి. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటే ఫలితాలు ఘోరంగా ఉంటాయి. అందుకు ఏం చేయాలో అంతా చేద్దాం. అధికారులుగా మీకు సంపూర్ణ సహకారం అందిస్తాం. మీరు చేయాల్సింది మీరు చేయండి. ఎలా కావాలంటే అలా ఆడుకుందాం.''ఇది తెలుగుదేశం పార్టీ నేతలు, అధికారుల మధ్య కుదిరిన పరస్పర అవగాహన. క్షేత్రస్థాయిలోనూ చర్యలు అలాగే ఉన్నాయి. ప్రత్యక్ష దాడులకు టీడీపీ మూక తెగబడితే, వారి కనుసైగల మేరకు కేసులు నమోదు వ్యవహారాన్ని పోలీసు వ్యవస్థ చూసుకుంటోంది. జిల్లా ఎన్నికల అధికారులు ఓటర్లకు జంబ్లింగ్ విధానం పెట్టారు. ఒక ఊరి ఓటర్లు మరో ఊర్లో ఓటు వేసేలా తారుమారు చేశారు. పోలింగ్ బూత్‌లు అదే ఊర్లో ఉంటాయి, కానీ అందులో ఓటు పక్క గ్రామానికి చెందిన ఓటర్లు వేయాలి. అదేంటీ అలా ఎందుకు మార్చారు, అంటే అభ్యంతరాలు కోరుతూ, పోలింగ్ బూత్‌లల్లో లిస్ట్ డిస్‌ప్లే చేశాం. అప్పట్లో ఎవ్వరూ స్పందించలేదని.. జిల్లా సర్వోన్నతాధికారి సెలవిచ్చారు. నల్లగొండుగారిపల్లె ఓట్లు ఆ గ్రామంలో వేసేదీ లేదు, నల్లపురెడ్డిపల్లెకు పోయి వేయాలని ఆ గ్రామస్తులకు చాటింపు ద్వారా తెలిపింటే అభ్యంతరాలు వచ్చేదీ, లేనిదీ నిమిషాల్లో తెలిసేది. అలాంటి ప్రక్రియ కొనసాగించలేదని ఆయా గ్రామస్తులు వివరిస్తున్నారు.

ఇప్పటికీ అందనీ ఓటు స్లిప్‌లు

బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ) ద్వారా ఓటర్లందరికీ ఓటు వివరాలు తెలిపే స్లిప్ చేరవేయాలి. రేపు పోలింగ్ కాగా ఇప్పటికీ చాలామందికి స్లిప్‌లు పంపిణీ కాలేదు. 95శాతం పంపిణీ చేశామని అధికారులు సమర్థించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో స్లిప్‌లు పంపిణీలో కూడా అలక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బీఎల్ఓలకు ఆయా ఓటర్లు వివరాలు కూడా గందరగోళంగా ఉండడమే ప్రధాన కారణం. మరోవైపు ఓటు స్లిప్ లేకపోతే, పోలింగ్‌కు వెళ్లరనే భ్రమలో టీడీపీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. వారి కనుసైగ మేరకే కొంతమందికే ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశారని పలువురు వెల్లడిస్తున్నారు.

ప్రచారం ముగిసింది..పోలింగ్ మిగిలింది!

సాక్షి రాయచోటి: జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఆదివారంతో తెర పడింది. దీంతో అభ్యర్థులు ఈనెల 12వ తేదీన జరిగే పోలింగ్‌పై దృష్టి సారించారు. కూటమి సర్కార్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు గెలుపు కోసం ఆ పార్టీ నేతలు అడ్డదారుల్లో పయనిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గెలువాలన్న అధిష్టానం సంకేతాలతో అన్ని రకాల కుట్రలకు తెర తీస్తున్నారు. మరోవైపు ఒంటిమిట్ట వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, పులివెందుల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డిని ఆశీర్వదించాలని పార్టీ నేతలు ఓటర్లను అభ్యర్థించారు.

- పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్‌లు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు.

కొనసాగుతున్న టీడీపీ మూకల హల్‌చల్

సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి, అమరేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలపై హత్యాయత్నానికి పాల్పడిన టీడీపీ మూక ఇప్పటికీ హల్‌చల్ చేస్తోంది. వాహనాల్లో రాడ్లు, కర్రలు వెంటబెట్టుకొని విచ్చలవిడిగా తిరుగుతున్నారు. ఇ.కొత్తపల్లె గ్రామానికి చెందిన రాధా అనే రైతుకు చెందిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్, వ్యవసాయ బోరు ధ్వంసం చేశారు. టీడీపీ మూక వైఎస్సార్‌సీపీ నేతల కోసం వేట కొనసాగిస్తున్నారు. వరుసగా దాడులు నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు కూడా అలెర్ట్‌గా ఉండడంతో టీడీపీ నేతల టార్గెట్ కొంత మిస్ అయ్యింది. పెద్ద ఎత్తున అల్లరి మూకలు చెలరేగిపోతున్నా కట్టడి చేయాలనే ఆలోచన పోలీసు అధికారులకు రాకపోవడం విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, జెడ్పీటీసీ ఎన్నికల్లో డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ పులివెందులలో తిష్టవేశారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలపై హత్యాయత్నం తర్వాత వివాదస్పద వ్యాఖ్యలు నేపథ్యంలో ఇక్కడే తిష్టవేయడం వల్ల ప్రజానీకం మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంత ఓటింగ్ నిర్వహణపై పలు అనుమానాలు కూడా వ్యక్తం చేస్తుండడం విశేషం.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు
- ఓటర్ల సౌలభ్యం కోసం బస్సులు, ఆటోలు ఏర్పాటు
- కలెక్టర్ శ్రీధర్,ఎస్పీ అశోక్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 12వ తేది జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఆదివారం ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒంటిమిట్టలో 30 పోలింగ్ కేంద్రాలు, పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పోలింగ్ ఉదయం 7.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలుచున్న వారంతా ఓటు వేసేంతవరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. సోమవారం సాయంత్రానికంతా పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుంటారని తెలిపారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి సంబంధించిన తొలి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని, రెండవ విడత సోమవారం నిర్వహిస్తున్నామని వివరించారు. గత ఎన్నికల్లో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాలు, ఒంటిమిట్టలో 10 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. వీటిలో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లు ఉంటాయన్నారు. వెబ్‌కాస్టింగ్‌కు అవకాశం లేనిచోట్ల మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నామని తెలిపారు. ప్రచారం ఆదివారం సా యంత్రం 5 గంటలకు ముగిసిందని, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల నుంచి స్థానికేతరులు వెళ్లిపోవాలన్నారు. లేనిపక్షంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తి కావచ్చిందని, ఇంకా మిగిలిన వారికి కూడా పంపిణీ చేస్తామన్నారు. పులివెందుల జెడ్పీటీసీ పరిధిలోని మూడు గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల మార్పుపై అభ్యంతరాలతో కూడిన పలు వినతులు రాగా, వాటిని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించామన్నారు. ఎస్ఈసీ ఆదేశాల మేరకు ఓటర్ల కోసం బస్సులు, ఆటోలు అందుబాటులోకి తీసుకు వస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండే ఓటర్లు వీటిని సద్వినియోగం చేసుకుని ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. అలాగే హెల్ప్ డెస్క్, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా హింసాత్మక సంఘటనలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, వి.కొత్తపల్లె ఓటర్లను ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్చడం పట్ల వస్తున్న విమర్శలను ప్రస్తావించగా, వివరాలను తొలుత ప్రదర్శించి అభ్యంతరాలను ఆహ్వానించామని కలెక్టర్ చెప్పారు. ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడం వల్ల వీటిని ఖరారు చేశామన్నారు. ఈనెల 14వ తేది కడప సమీపంలోని మను పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు.

కట్టుదిట్టమైన భద్రత – ఎస్పీ

పోలింగ్ సజావుగా సాగేందుకు వీలుగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామన్నారు. సీసీ కెమెరాలతో పాటు రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 13 జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులతోపాటు పులివెందుల, ఒంటిమిట్ట పరిసరాల్లోని 15 చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామన్నారు. పెట్రోలింగ్ పార్టీలు, మొబైల్ వీడియో కెమెరాలు, నేత్ర వాహనాలతోపాటు రెండు అత్యాధునిక డ్రోన్స్ వినియోగిస్తున్నామని వివరించారు. రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీ ఏర్పాటు

కడప అగ్రికల్చర్: జిల్లాలోని 30 సహకార సంఘాలకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో ఒక చైర్మన్‌తోపాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. సాధారణంగా ఎన్నికలను నిర్వహించి ఈ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించకుండా సొసైటీలో సభ్యత్వం ఉన్న వారిలోనే ఒకరిని చైర్మన్‌గా మరో ఇద్దరిని కమిటీ మెంబర్స్‌గా ఎంపిక చేయడం గమనార్హం.

జిల్లా స్కౌట్ రోవర్‌కు 'నేషనల్ లీడర్' పురస్కారం



అతిథుల నుంచి 'బెస్ట్ కంటింజెంట్ లీడర్ అవార్డు అందుకుంటున్న అహమ్మద్

కడప ఎడ్యుకేషన్: వైఎస్‌ఆర్ కడప జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన స్కౌట్ రోవర్ సగినాల అహమ్మద్ 'నేషనల్ కంటింజెంట్ లీడర్ అవార్డు' సాధించారు. ఆగస్ట్ 5 నుంచి 9వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని పెరంబూరు (సదరన్ రైల్వే)లో నేషనల్ రోవర్/ రేంజర్ కార్నివాల్ నిర్వహించారు. ఈ కార్నివాల్‌కు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన రేంజర్లు, రోవర్లు హాజరు కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి పులివెందులకు చెందిన సగినాల అహమ్మద్ పాల్గొని వివిధ అంశాల్లో చక్కటి ప్రతిభను కనబరచటంతో పాటు ఓవరాల్‌గా 'స్టేట్ బెస్ట్ కంటింజెంట్ లీడర్' అవార్డుకు ఎంపికయ్యాడు. జిల్లాకు చెందిన స్కౌట్ జాతీయస్థాయిలో కంటింజెంట్ లీడర్ అవార్డును అందుకోవడంపై జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



అసెస్‌మెంట్ బుక్‌లెట్స్‌ను పరిశీలిస్తున్న పాఠ్యపుస్తకాల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రాము

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమయ్యే ఎఫ్‌ఏ- 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని దీంతోపాటు ప్రతి విద్యార్థికి అసెస్‌మెంట్ బుక్‌లెట్ అందాలని పాఠ్యపుస్తకాల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రాము ఆదేశించారు. ఆదివారం ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కడప నగరంలోని సీఎస్ఐ పాఠశాలలో గల డీసిఈబీ హాల్‌ను, వల్లూరు మండల వనరుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోని ప్రతి విద్యార్థికి తరగతి వారీగా సబ్జెక్టు వారీగా అసెస్మెంట్ బుక్కును తప్పనిసరిగా అందించాలని సూచించారు. అసెస్మెంట్ బుక్‌లో ఆగస్టు, అక్టోబర్, నవంబర్, జనవరి, ఫిబ్రవరి, ఏప్రిల్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు అసెస్మెంట్ బుక్స్‌ను భద్రంగా ఉంచుకొని తర్వాత పరీక్షలకు ఇందులో నిర్వహించాలని సూచించారు. డీసీఈబీ సెక్రటరీ విజయ భాస్కర్ రెడ్డి, కడప మండల విద్యాశాఖ - 2 షేక్ ఇర్షాద్ అహ్మద్, ఉమ్మడి జిల్లా బుక్స్ గోడౌన్ మేనేజర్ రామాంజనేయమ్మ , జిల్లా బుక్స్ గోడౌన్ సిబ్బంది నరేష్, అనిల్, కడప సీఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

జిల్లాలో జోరు వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున జిల్లావ్యాప్తంగా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, ముద్దనూరు మినహా మిగతా 32 మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో పెండ్లిమర్రిలో అత్యధికంగా 69.6 వర్షం నమోదుకాగా అత్యల్పంగా వీఎన్‌పల్లిలో 1.4 మి.మీ వర్షం నమోదైంది.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
పెండ్లిమర్రి	: 69.6	మైలవరం	: 13.2
కొండాపురం	: 64.2	బద్వేల్	: 12.8
చక్రాయపేట	: 45.2	తొండూరు	: 12.4
చెన్నూరు	: 51.8	దువ్వూరు	: 11.2
లింగాల	: 30.2	చాపాడు	: 10.6
సిద్దవటం	: 27.2	వేముల	: 10.2
పెద్దముడియం	: 26.2	బి.మఠం	: 8.0
సికెదిన్నె	: 23.6	మైదుకూరు	: 7.8
సింహాద్రిపురం	: 22.6	రాజుపాలెం	: 7.2
కడప	: 22.4	బికోడూరు	: 6.8
వల్లూరు	: 22.2	ఒంటిమిట్ట	: 6.8
అట్లూరు	: 21.6	కమలాపురం	: 4.6
పులివెందుల	: 18.0	ప్రొద్దుటూరు	: 3.4
జమ్మలమడుగు	: 17.4	ఎర్రగుంట్ల	: 3.4
వేంపల్లి	: 15.2	వీఎన్‌పల్లి	: 1.4

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



ఓటు బ్యాలెన్ నమూనా ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, తదితరులు

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మోట్నూతలపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ జెడ్పీటీసీ ఎన్నిక చాలా చిన్నదని, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి చనిపోయిన సందర్భంలో ఆయన కొడుకు హేమంత్ రెడ్డిని జెడ్పీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బరిలోకి దించిందన్నారు. సాధారణంగా ఈ ఎన్నికను సానుభూతికి వదిలేస్తారన్నారు. కానీ, ఆదినారాయణరెడ్డి లాంటి జిమ్మిక్కులు చేసే వ్యక్తులకు తోడు చంద్రబాబు, లోకేష్ పోటీకి వ చ్చారన్నారు. పోటీ చేయడం తప్పేమి లేదు గానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరింపులకు గురి చేయడం, కొంతమందిని ఆర్థికంగా ప్రలోభాలతో మభ్య పెట్టడం దారుణమన్నారు. దీంతో పాటు భౌతిక దాడులకు దిగడం అరాచకానికి పరాకాష్ట అని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలపైనే రివర్స్‌గా ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు పెట్టించడం అన్యాయమన్నారు. ఇలా దుర్మార్గమైన పరిస్థితులలో ఎలెక్షన్లు జరుగుతున్నాయన్నారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల మార్పుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఓటు వేయడానికి ఓటర్లు రాకుండా కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది తప్పుడు విధానమన్నారు. లోకేష్ ఆది నారాయణరెడ్డి ట్రాప్‌లో పడ్డారని, ఆదినారాయణరెడ్డి లేనిపోని అబద్ధాలు మాట్లాడుతూ విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని గొప్పగా చెప్పి.. ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌లు పులివెందులను సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఒంటిమిట్టలో భారీ ప్రచార ర్యాలీ



ప్రసంగిస్తున్న బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, చిత్రంలో ఎమ్మెల్యే ఆకేపాటి, జెడ్పీటీసీ అభ్యర్థి

ఒంటిమిట్ట(రాజంపేట): జెడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచార చివరిరోజు ఆదివారం ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ చేపట్టింది.ఈ ర్యాలీలో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. కూటమి కుట్రలను తిప్పికొట్టేలా వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా కొనసాగిన ర్యాలీకి విశేషస్పందన లభించింది. రాములోరి కల్యాణవేదిక ప్రాంతం నుంచి కొనసాగిన ర్యాలీలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు,వివిధ ప్రాంతాల రైతులు, యువకులు, విద్యార్థులు, ముస్లీంమైనార్టీలు, దళితులు పాల్గొన్నారు. ఒంటిమిట్ట వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యమని ధీమాను వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట వైఎస్ జగన్ అడ్డా అన్నారు. ఎంతమంది ఎన్నికుట్రలు పన్నినా, కేబినెట్ కదిలివచ్చినా చేసేదేమి ఉండదని, ఓటమి చవిచూడటం తప్ప అన్నారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో కూటమి కుట్రలను ఒంటిమిట్ట వాసులే ఓటు అనే ఆయుధంతో తిప్పికొడతారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా ఒంటిమిట్టలో కొనసాగిందని ఉన్నతాధికారులకు తెలిసినా అడ్డుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్నారన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలే అండగా నిలుస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు.

- ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజద్‌బాషా, కొరముట్ల, కడప జెడ్పీచైర్మన్ రామగోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు పకడ్బందీగా బందోబస్తు

- 1400 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో విధులు
- ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషి
- జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ వెల్లడి

కడప అర్బన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 12న ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 1400 మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీగా విధులను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో మీడియాకు వివరాలను తెలియజేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికకు 550 మంది పోలీసులు, 4 ఏపీఎస్పీ ప్లటూన్లు, ఏఆర్ పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించనున్నామన్నారు.


జెడ్పీటీసీ ఉప ఎన్నికల బందోబస్తు వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానంలో ఉప ఎన్నికకు 650 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారన్నారు. ఇప్పటివరకు పులివెందులలో 500 మందిపై, ఒంటిమిట్టలో 650 మందిపై బైండోవర్ కేసులను నమోదు చేశామన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడిందన్నారు. స్థానికేతరులు ఆయా ప్రాంతాలలో వుండకూడదన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిఘా వుంచుతామన్నారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

స్వర్ణ దుకాణంలో చోరీ

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని మసీదు కాంప్లెక్స్‌లో గల జె.బి. స్వర్ణ దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో 72 గ్రాముల బంగారు ఆభరణాలు, 7 కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన జబీవుల్లా స్థానిక సిద్దవటం రోడ్డులోని మసీదు కాంప్లెక్స్‌లో గత కొన్నేళ్లుగా స్వర్ణ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరే శనివారం కూడా వ్యాపార కార్యకలాపాలు పూర్తి చేసుకుని దుకాణంలోని వస్తువులన్నీ సర్ది బ్యాగులో ఉంచి ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలో ఫోన్ రావడంతో దుకాణంలో ఉండే పిల్లలను చూస్తూ ఉండమని చెప్పి దుకాణం నుండి బయటికి వచ్చాడు. అప్పటికే కాపు కాసిన ఇద్దరు యువకులు దుకాణంలోకి వెళ్లి బంగారు, వెండి ఆభరణాలను భద్రపరిచిన బ్యాగులను తీసుకుని బైక్‌లో పరారయ్యారు. వెంటనే చుట్టుపక్కల వారు అప్రమత్తమై గట్టిగా కేకలు వేస్తూ వెంబడించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న దుకాణ యజమాని అర్బన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పట్టణంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం ఘటనా స్థలాన్ని క్లూస్‌టీం పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.


చోరీ జరిగిన స్వర్ణదుకాణం

ఎమ్మెల్సీ ఆరా..

వైఎస్సార్‌సీపీ నాయకుడైన జబీవుల్లాకు చెందిన స్వర్ణ దుకాణంలో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి నిందితులను గుర్తించి బాధితుడికి త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


మైదుకూరు : మైదుకూరు – బద్వేలు రహదారిలో మండలంలోని బసవాపురం టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని దేరంగుల పవన్ కుమార్ (23) అనే యువకుడు మృతి చెందాడు. ఎర్రగుంట్లకు చెందిన పవన్ కుమార్, నాగరాజు నాయక్ అనే వారు శనివారం రాత్రి మోటార్ బైక్‌పై బద్వేలు వైపు నుంచి వస్తుండగా టోల్ గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడిన పవన్ కుమార్‌ను 108 వాహనంలో మైదుకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో నాగరాజు నాయక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతి చెందిన పవన్ కుమార్ అవివాహితుడని తెలుస్తోంది. సంఘటనపై కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్టు మైదుకూరు అర్బన్ పోలీసులు ఆదివారం తెలిపారు.

అప్పల బాధ తట్టుకోలేక..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కమలాపురం మండలం సి.రాజుపాలెం గ్రామానికి చెందిన కామనూరు నాగరాజు (35) అప్పుల బాధ తట్టుకోలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు నాగరాజు భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. మద్యానికి అలవాటుపడిన నాగరాజు అప్పులు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తనకు ఆరోగ్యం సరిగా లేదని పందిళ్లపల్లెలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్ద చికిత్స చేయించుకుని వస్తానని తన తల్లికి చెప్పి కమలాపురం–ఎర్రగుడిపాడు మధ్యన దిగువ రైలు పట్టాలపై రైలు కింద పడి మృతి చెందాడు. 0701 నెంబరుగల రైలు లోకో పైలట్ వెంకటేశ్వర్లు గమనించి ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుతో విద్యుత్ సామగ్రి దగ్ధం


పిడుగు పాటుతో కాలిన విద్యుత్తు బోర్డు


గ్రామంలో కాలి పగిలిపోయిన వీధిలైటు

అట్లూరు : ఉన్నట్టుండి ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పాటుకు మండల పరిధిలోని వళసపాళెం గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. గ్రామస్తుల వివరాల మేరకు శనివారం రాత్రి ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో విస్తారంగా వర్షం కురిసింది. అయితే అదే తరుణంలో భయంకరమైన మెరుపుతో గ్రామంలోని చిట్టెం వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బమ్మల ఇంటిపై పిడుగు పడింది. ఆ సమయంలో వెంకటసుబ్బారెడ్డి బద్వేలులో వివాహ కార్యక్రమానికి వెళ్లారు. ఆయన భార్య రామసుబ్బమ్మ కూడా గ్రామంలోని రామాలయంలో భజన కార్యక్రమంలో ఉన్నారు. దీంతో ప్రాణ నష్టం తప్పింది. వారి ఇంటిలోని విద్యుత్ పరికరాలు, ఫ్రిజ్, తాగు నీటి మోటారుకు సంబంధించిన స్టార్టర్ పూర్తిగా కాలిపోయాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన వీధిలైట్లు సైతం పగిలిపోయాయని గ్రామస్తులు తెలిపారు.

క్లుప్తంగా

ఎలుగుబంటి దాడి


ఎలుగుబంటి దాడిలో గాయపడిన నాగరాజు

పోరుమామిళ్ల : మండలంలోని ఎరసాలకు చెందిన బాయకట్టు నాగరాజు ఆదివారం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఊరికి సమీపంలోని కొండలో గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. కొండపొలంలో గొర్రెలు మేస్తుండగా పిల్లలున్న ఎలుగుబంటి నాగరాజుపై దాడి చేసింది. హఠాత్తుగా వచ్చిన ఎలుగుబంటిని చూసిన నాగరాజు పెద్దగా కేకలు వేస్తూ తనను కాపాడుకునేందుకు ప్రయత్నించాడు. ఇంతలో దగ్గరలో ఉన్న గొర్రెల కాపరులు కేకలు వేస్తూ అక్కడకు చేరుకోవడంతో ఎలుగుబంటి పిల్లలతో పారిపోయింది. ముఖానికి, చేతులకు బాగా గాయాలవడంతో నాగరాజును పోరుమామిళ్లలో ప్రథమ చికిత్స అనంతరం కడపకు తరలించారు.

షూటింగ్ ప్రారంభం


ఉప్పలూరులో విద్యాదీపం సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ నిర్మల

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన ముత్తుముల లోకేష్ హీరోగా 'విద్యాదీపం' అనే సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. శనివారం రాత్రి ఉప్పలూరులోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో షూటింగ్ చేశారు. హీరో లోకేష్, హీరోయిన్ సావిత్రికృష్ణలపై ఎంఈఓ నిర్మల క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పిల్లి రమణారెడ్డి, సంఘ సేవకుడు బీఎస్ నారాయణరెడ్డితోపాటు 40 మంది సినిమా యూనిట్ సభ్యులు, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోడపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ఇంటి గోడపై నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. ఈశ్వరమ్మ కాలనీకి చెందిన రెడ్డెమ్మ ఇంటికి ఫైబర్ నెట్ కనెక్షన్ ఇవ్వగా, ఆ వైరు కిందకు వేలాడుతుండటంతో, ఇంటిగోడ పైకి ఎక్కి సరిచేసే క్రమంలో అదుపుతప్పి కిందకు పడి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైలు కింద పడి ఆత్మహత్య

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్ మధ్యలో ఆర్.రాచపల్లి రైల్వేగేటు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడు(60) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నట్లు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గారీశంకర్ తెలిపారు.

కూలిన మట్టి మిద్దె

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని తిరువెంగళాపురం పంచాయతీలోని తిరువెంగళాపురం ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ మట్టి మిద్దె కూలిపోయింది. తిరువెంగళాపురం ఎస్సీ కాలనీకి చెందిన నాగిపోగు బాలకృష్ణ కొన్నేళ్లుగా తన కుటుంబ సభ్యులతో కలిసి ఓ మట్టి మిద్దెలో నివసిస్తున్నాడు. అయితే శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటిలోని ఓ గది పైకప్పు అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో బాలకృష్ణతో పాటు కుటుంబ సభ్యులు వేరే గదిలో నిద్రిస్తుండటంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.


కూలిన మిద్దె పైకప్పు

ట్రాక్టర్ కింద పడి యువకుడి దుర్మరణం

కడప అర్బన్ : కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో ఆదివారం ట్రాక్టర్ కింద పడి దొరబోయిన సుదర్శన్ (21) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటనపై కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నూరు మండలం కొక్కిరాయపల్లె గ్రామానికి చెందిన దొరబోయిన సుదర్శన్ (21) ఐటీఐ చదువుకుంటున్నాడు. అతని అన్న కడప కార్పొరేషన్‌కు సంబంధించి చెత్త సేకరించేందుకు తమ ట్రాక్టరు బాడుగకు ఇచ్చాడు.


మృతి చెందిన సుదర్శన్

ఆదివారం కావడంతో సుదర్శన్ కూడా ట్రాక్టరుతోపాటు వచ్చాడు. విజయదుర్గాదేవి ఆలయం నుంచి బిల్టప్ మార్గమధ్యంలోకి రాగానే బర్రె అడ్డు రావడంతో ట్రాక్టరు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టరులో ఉన్న సుదర్శన్ జారి అదే ట్రాక్టరు క్రింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చిన్నమండెం : పవిత్ర పుణ్య క్షేత్రం గండి నుంచి మదనపల్లెకు వెళ్తున్న కారుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మదనపల్లెకు చెందిన ప్రయాణీలు గండి దర్శనం చేసుకుని తిరిగి వెళ్తుండగా చిన్నమండెం మండలం దేవగుడిపల్లె వద్దకు రాగానే కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు

దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి కన్నుమూత


ఆవుల వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి (73) మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మరణ వార్త వినగానే ఆవుల కుటుంబ సభ్యులతో పాటు రాయచోటి నియోజకవర్గం, సంబేపల్లె మండల వ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

నిత్యం ప్రజలలోనే : ఆవుల వేణుగోపాల్‌రెడ్డి నిత్యం ప్రజల మనిషిగానే మెలిగేవారు. ఎవరు ఏ సహాయం కావాలని అడిగినా స్పందించే నాయకుడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అలానే పేద విద్యార్థుల విద్యకు అండగా నిలిచేవారు. దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలలు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు ఆయన చేసిన కృషి ఎనలేనిది. ఆయన చిన్న వయస్సులోనే సినీ నిర్మాణంపై ఆసక్తి చూపుతూ దేవపట్ల – సంబేపల్లె ప్రాంతాలలో పలు చిత్రాల చిత్రీకరణకు సహకరించారు. వేణుగోపాల్‌రెడ్డికి ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికాలో స్థిరపడగా, రెండవ కుమారుడు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి డీసీఎంఎస్ చైర్మన్‌గా పని చేశారు. అలాగే ఆమె కోడలు నాగశ్రీలక్ష్మి ప్రస్తుతం సంబేపల్లె ఎంపీపీగా ఉన్నారు. మూడో కుమారుడు మల్లికార్జునరెడ్డి వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. కాగా మండల పరిధిలోని దేవపట్ల పంచాయతీ ఆవులవాండ్లపల్లెలో 12 వ తేదీ మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కూలిన వంతెన స్థానంలో అప్రోచ్ రోడ్డు

సిద్దవటం : కడప–బద్వేలు మార్గ మధ్యంలోని అటవీ ప్రాంతంలో కిటికీల వంతెన కూలిపోయిన నేపథ్యంలో ఆదివారం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ రహదారికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డుకు గ్రావెల్ వేయించి డోజర్‌తో చదును చేయించామన్నారు. దీంతో లారీలు, బస్సులు యాథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు. అప్రోచ్ రోడ్డు రహదారిపై సిమెంటు పైపులు వేసి రహదారిని ఎత్తు లేపుతామన్నారు. లేదంటే వర్షాలకు గ్రావెల్ కొట్టుకు పోతుందన్నారు.

డబ్బులిచ్చాం.. ఓటరు స్లిప్‌లు ఇవ్వండి!

- తెలుగు తమ్ముళ్ల ఒత్తిడికి బెంబేలెత్తుతున్న ఓటర్లు
- పోలింగ్‌కు మీరు రావొద్దు.. మేమే ఓట్లు వేసుకుంటాం
- గ్రామాల్లో విస్తుపోతున్న వైనం

సాక్షి ప్రతినిధి, కడప : తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలు అన్నీ ఇన్నీ కావు. వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి మరీ దాడులు చేస్తే తాజాగా ఓటర్లను టార్గెట్ చేశారు. ఓటుకు నోటు తీసుకో... మీకిచ్చిన ఓటు స్లిప్ మాకు ఇవ్వండి. మేమే ఓటు వేసుకుంటాం. ఇదిగో రూ.5వేలు తీసుకో, మీ ఓటు స్లిప్ మాకు ఇవ్వు. గ్రామాల్లో తాజాగా తెరపైకి వచ్చిన తంతు ఇది. ప్రచార పర్వం ముగియడంతో ఓటర్లను ప్రలోభపెట్టే చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్రతి గ్రామంలో ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఓటుకు రూ.5వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఓటుకు నోటుతో పాటు మీకో గిఫ్ట్ కూడా ఇస్తాం. మీ ఓటు స్లిప్ మాకు ఇవ్వండి. ప్రభుత్వం మాదే, పోలీసులు మావాళ్లే, అధికారులు మా వాళ్లే, మీ ఓటు మేమే వేసుకుంటామని చెప్పుకొస్తున్నారు. డబ్బులిస్తే ఇవ్వండి, లేదంటే లేదు, మా ఓటు మీరు వేసుకునేది ఏంది? మా ఓటు మేమే వేస్తామని కొందరు ప్రతిఘటిస్తున్నారు. సామాన్యులు నోరు మెదపలేని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికే అధికారులు పోలింగ్ బూత్‌లలో ఓటర్లను మార్చేశారు. ఆయా గ్రామాల్లో కాకుండా పక్క గ్రామాలకు వెళ్లి ఓట్లు వేయాల్సిన పరిస్థితి కల్పించారు. తాజాగా అక్కడికి వెళ్లి ఓట్లు వెయ్యాల్సిన అవసరం లేదు. మేమే మీ ఓటు వేస్తాం, డబ్బు తీసుకొని స్లిప్ ఇవ్వండని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు.

అత్యధిక పోలీసులు ఏకపక్ష పోలింగ్ కోసమేనా?

అత్యధిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయడం ఏకపక్ష పోలింగ్ కోసమేనా అనే సందేహం ఇప్పుడు ఓటర్లకు వస్తోంది. ఓటరు స్లిప్ లేకపోయినా పోలింగ్ బూత్ లెవెల్ అధికారి వద్ద స్లిప్ తీసుకొని వెళ్లొచ్చు. కానీ, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్‌పార్టీ పోలీసులు, సీఐలు, ఎస్ఐ వీరందరినీ దాటుకొని వెళ్లడం సామాన్య గ్రామీణ ఓటర్లకు సాధ్యమవుతుందా? అనే సందేహం ప్రజాస్వామ్యవాదుల్లో వ్యక్తమవుతోంది. తెలుగుదేశం పార్టీ నేతలు, అధికారులు ఒక్క జెడ్పీటీసీ కోసం ఎన్ని ఇక్కట్లు సృష్టించాలో అన్నీ సృష్టిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టాల్లో ఉన్నాడని మనోన్ని వదులుకుంటామా..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టాల్లో ఉన్నాడని వదులుకుంటామా? మనోడి కోసం ఒక్క రోజు కష్టపడలేమా? పులివెందుల ప్రజానీకం నుంచి వినిపిస్తున్న మాటలివి. ఈ మాటలు టీడీపీ నేతల చెవిలో పడ్డాయి. హైటెక్ తెలివితేటలు తెరపైకి వచ్చాయి. పోలింగ్ రోజు ఓటర్లు హాజరు కాకుండా చేయాలనే సంకల్పంతోనే స్లిప్ ఇవ్వండి, డబ్బులు తీసుకోండనే దిశగా ఒత్తిడి పెంచినట్లు సమాచారం. మరోవైపు టీడీపీ నేతలకు తోడుగా పోలీసులు కూడా దగ్గరుండి డబ్బులు పంచుతుండడం, వారి సమక్షంలోనే ఓటరు స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో గ్రామీణులు నోరెళ్లబెడుతున్నారు.

పెన్నానదికి నీరు విడుదల బంద్

జమ్మలమడుగు : మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి అధికారులు నీటి విడుదలను ఆపేశారు. శనివారం నుంచి భారీగా నీరు విడుదల అవుతుండటంతో కొన్ని గ్రామాలకు సంబంధించిన రాకపోకలు బంద్ అయ్యాయి. ముఖ్యంగా వేపరాల–జమ్మలమడుగు రహదారిపై రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిచిపోవడంతో పాటు రోడ్డు కొట్టుకుని పోయింది. అదేవిధంగా ఎర్రగుంట్ల మండలంలోని థర్మల్ , ముద్దనూరుకు వెళ్లే పెన్నానది రహదారి నీటి పెరుగుదల వల్ల రోడ్డు కోసుకుపోవడంతో ఈ ప్రాంతంలో కూడా రాకపోకలు బంద్ అయ్యాయి. ఆదివారం ఉదయం పెన్నానదిలో ముగ్గురు భక్తులు కన్యతీర్థం వెళ్లి తిరిగి వచ్చే సమయంలో వాహనం పెన్నానదిలో చిక్కుకోవడంతో బాధితులను బయటికి తీయడం కోసం నీటిని బంద్ చేశారు.

మైలవరంలో పూర్తి స్థాయిలో నీటి సామర్థ్యం..

శ్రీశైలం ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటి మట్టం ఉండటంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా రోజుకు 13 వేల క్యూసెక్కుల నీరు గండికోట ప్రాజెక్టులోనికి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం గండికోటలో 14.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీని పూర్తి నీటి సామర్థ్యం 26 టీఎంసీలు. ప్రస్తుతం కృష్ణా జలాలు వస్తున్న నీటితో చిత్రావతి, వామికొండ, సర్వరాయ సాగర్, మైలవరలం జలాశయంలో నీటిని నింపే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా సోమశిల ప్రాజెక్టులోనికి సైతం కృష్ణా జలాలు పెన్నానది ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి స్థాయిలో నీటి మట్టం ఉండటంతో గండికోట నుంచి నీటిని విడుదల చేస్తే ఆ నీరు మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి వదిలేయాలి. దీంతో గండికోట ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు గండికోట నుంచి వదిలే నీటిని బంద్ చేశారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోనికి నీటిని అధికారులు విడుదల చేస్తే గండికోట నుంచి మైలవరం జలాశయం లోనికి నీటిని విడుదల చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయం పూర్తి సామర్థ్యంతో ఉండటంతో వచ్చే నీరు దిగువకు వదలాల్సి ఉంది. ప్రస్తుతం బంద్ కావడంతోనే గండికోట నుంచి నీటిని బంద్ చేసినట్లు గండికోట, మైలవరం ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నారు


థర్మల్ రహదారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మైలవరం నీరు

చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల : కలసపాడు మండలం గంగాయపల్లెలో ఈనెల 7న నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ముట్టే నరేంద్ర(20) అలియాస్ జగన్‌ను ఆదివారం మార్కాపురం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ నరేంద్ర జులాయిగా తిరిగేవాడన్నారు. మద్యానికి బానిసయ్యాడని, తల్లిదండ్రులను కూడా ఇబ్బంది పెట్టేవాడన్నారు. సెల్‌ఫోన్‌లో అసభ్య వీడియోల ప్రభావంతో పథకం ప్రకారం చిన్నారిని పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడన్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పెడతామన్నారు. సమావేశంలో కలసపాడు, పోరుమామిళ్ల ఎస్ఐలు తిమోతి, కొండారెడ్డి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు

పెన్నానదిలో చిక్కుకున్న వృద్ధ దంపతులు

- సురక్షితంగా కాపాడిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : పెన్నానదిలో చిక్కుకున్న ఇరువురు వృద్ధులను పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రేగుళ్లపల్లె గ్రామానికి చెందిన గండి చిన్న సుబ్బరాయుడు, ఆయన భార్య నారాయణమ్మలు ఆదివారం పెన్నానదిలోకి వెళ్లారు. అయితే పెన్నా నదికి మైలవరం నీరు వదలడంతో నీటి ప్రవాహం ఒక్క సారిగా పెరిగింది. దీంతో వృద్ధ దంపతులు నీళ్లలో చిక్కుకున్నారు. వారిని స్థానికులు గుర్తించి డయల్ 100కు ఫోన్ చేశారు. రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన పెన్నానదికి చేరుకున్నారు. బోటు ద్వారా నీళ్లలోకి వెళ్లి వృద్ధులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.


పెన్నానదిలో నుంచి సురక్షితంగా బయటపడిన వృద్ధ దంపతులు

సీ అండ్ డీ ప్రదేశంలో బీ గ్రేడ్ బెరైటీస్ ఖనిజం

- కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న వైనం

ఓబులవారిపల్లె : తక్కువ గ్రేడ్ ఖనిజమైన సి అండ్ డి గ్రేడ్ యాడ్‌లో విలువైన బి గ్రేడ్ ఖనిజం తరలించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై ఆదివారం పెద్దఎత్తున బయట ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంగంపేట ఏపీఎండీసీలో ఖనిజం అమ్మకాల్లో భారీ ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. సి అండ్ డీ గ్రేడ్ 0.4 గ్రావిటీ కలిగి ఉండి రూ. 2200 టన్ను ధరతో ఏపీఎండీసీ విక్రయాలు చేస్తోంది. అయితే 1.2 గ్రావిటీ కల్గిన బి గ్రేడ్ ఖనిజం టన్ను ధర దాదాపు రూ. 6 వేలు ఉంది. గనుల నుండి వెలికి తీసిన బి గ్రేడ్ ఖనిజాన్ని కేటాయించిన స్థలంలో కాకుండా సి అండ్ డి గ్రేడ్ ఖనిజం ఉన్న యార్డుకు తరలించి సి అండ్ డి గ్రేడ్ ధరకు బి గ్రేడ్ ఖనిజాన్ని అక్రమంగా తరలించుకుని పోతున్నారు. దీంతో కోట్లాది రూపాయలు ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్నారు. శనివారం బి గ్రేడ్ ఖనిజాన్ని సి అండ్ డి యార్డులో తోలినట్లు గమనించిన సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఖనిజాన్ని పరిశీలించారు. ఈ విషయంపై సీపీఓ గోపినాథ్‌ను వివరణ కోరగా బెరైటీస్ ఖనిజాన్ని పరిశీలించామన్నారు. అనాలసిస్ చేసిన అనంతరం 0.7 గ్రావిటీ వచ్చిందని అది సి అండ్ డి గ్రేడ్ ఖనిజమే అని నిర్ధారించినట్లు తెలిపారు.


సీ అండ్ డీ ప్రదేశంలో బీ గ్రేడ్ బెరైటీస్ ఖనిజం